సాక్షి ప్రకాశం

సోమవారం । 15 । జనవరి । 2024



నేటి నుంచి జాతీయస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

ఒంగోలు రూరల్: సంక్రాంతి క్రీడా సంబరాల్లో భాగంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 15, 16 తేదీల్లో రేవు రాధాకృష్ణ, రాజేశ్వరమ్మ, విజయలక్ష్మి క్రీడా ప్రాంగణంలో జాతీయస్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శిరిగిరి రంగారావు తెలిపారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి.

గరిష్టం/కనిష్టం
31/23

వాతావరణం

ఉదయం పొగమంచు ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.



ఒంగోలు గాంధీ రోడ్డులో వాసవీ క్లబ్ అధ్వర్యంలో భోగి సంబరం

పల్లె మకరందం

అచ్చ తెలుగు సంప్రదాయ పండుగ సంక్రాంతికి పల్లె.. పట్నాలు ముస్తాబయ్యాయి. ఇళ్ల ముంగిట ముత్యాల ముగ్గులు..హరిదాసు సంకీర్తనలు..గంగిరెద్దుల విన్యాసాలు.. మంచుతెరలు తొలిగేలా చిన్నా పెద్దా ఏకమై ఎర్రని కాంతుల భోగుల్లో ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. ఆనం దాల సంక్రాంతికి స్వాగతం పలికారు. మరో వైపు పండక్కి సొంతూళ్లకు వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువుల కోసం నోరూరించే పసందైన వంటకాల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. ధాన్యపు రాశులతో అన్న దాత ఇంట ఉత్సాహం రెట్టింపయింది. పండుగ కొనుగోళ్లతో మార్కెట్లన్నీ కళకళలాడాయి. దేవాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. గోదాదేవి కల్యాణానికి సకల ఏర్పాట్లు చేశారు.

– ఫొటోలు : సాక్షి, ఒంగోలు



పతంగితో యువతి ఉత్సాహం..



సంక్రాంతి రంగవల్లి తీర్చిదిద్దుతున్న యువతులు



నోరూరించే పిండి వంటలు..



ఒంగోలు చెన్నకేశవస్వామి ఆలయం వద్ద..



ఒంగోలు గంగిరెద్దులకు వాయనమిస్తున్న యువతులు

సాగర్ జలాలు తీసుకువస్తా

మద్దిపాడు: గుండ్లకమ్మకు అదనంగా సాగర్ జలాలను తీసుకువచ్చి ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తానని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గుండ్లకమ్మ జలాశయాన్ని పరిశీలించారు. జలాశయం కింద ఉన్న ఆయకట్టు రైతులు సాగునీరు వదలాలని కోరడంతో ఇక్కడకు వచ్చానన్నారు. రిజర్వాయర్‌లో ఉన్న నీరు తాగునీటికి ఉంచినట్లు కలెక్టర్ చెప్పారని, ఆయకట్టు సాగుకు నీటి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి సాగర్ జలాలు ఒక టీఎంసీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ ప్రాంతానికి అత్యంత ముఖ్యమైన గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను పరిరక్షించడంలో తాను ముందుంటానన్నారు. రైతులకు ఆరుతడులకు నీరు అందించే విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఎకరానికి నీరు అందించాలన్న కృతనిశ్చయంతో సీఎం ఉన్నారని, సమస్యను తక్షణమే సీఎం దృష్టికి తీసుకువెళ్లి నీరు విడుదల చేయించేలా చూస్తానన్నారు. ఎడమ కాలువ కింద ఆయకట్టు రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, ఓబుల రెడ్డి, లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు పల్లకి పద్మకుమారి, పైనం ప్రభాకర్ సర్పంచ్‌లు రామాంజనేయులు, నారా సుబ్బారెడ్డి, కొప్పోలు ఆంజనేయులు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి మేరుగు నాగార్జున

టీడీపీ అడ్రస్ గల్లంతే

- వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్



విలేకరులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రానున్న ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి భవనంలో ఆదివారం జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో మేలు జరిగితేనే తమ పార్టీకి ఓటు వేయమని అడుగుతున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, గతంలో అటువంటి నాయకుడిని రాష్ట్ర ప్రజలు చూసి ఉండరన్నారు. 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రజాధనాన్ని స్వాహా చేసి అన్ని రంగాలను నిర్వీర్యం చేశాడని మండిపడ్డారు. తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు ఎదుటి వారిపై నిందలు వేస్తారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ధైర్యంగా ఎదుర్కొనే దమ్ము లేక పొత్తులు పెట్టుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తుంటే పచ్చ పత్రికలు, ఛానెళ్లు అవేమీ పట్టించుకోకుండా నిత్యం ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన తాను తొలిసారిగా శనివారం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటించానని, ఒకరిద్దరు నాయకులు అత్యవసర పనుల్లో ఇతర ప్రాంతాల్లో ఉండటంతో రాలేకపోతున్నామని ముందుగానే తెలియజేశారని, కానీ పచ్చ పత్రికలు వాటిని కూడా వర్గపోరుతో పోలుస్తూ కథనాలు వండివార్చడాన్ని జనం ఛీదరించుకుంటున్నారన్నారు.

సామాన్య కార్యకర్త నుంచి..ఇన్‌చార్జి స్థాయికి ..

తాను సింగరాయకొండలో వైఎస్సార్ సీపీలో సామాన్య కార్యకర్తగా పనిచేసేవాడినని, అటువంటి తనను నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పచెప్పడం జగనన్న గొప్పతనమని కొనియాడారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యర్రగొండపాలెం నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతానన్నారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆశీస్సులతో ముందుకు వెళతానని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, వాగ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.మజీద్, మాజీ ఎంపీపీలు దుగ్గెంపూడి వెంకటరెడ్డి, అమిరెడ్డి రామిరెడ్డి, మూడమంచు బాలగురవయ్య, మార్తల సుబ్బారెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీ సుబ్బారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.జయరావు, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, మిడత నరసింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇష్ట కామేశ్వరిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి



తెలంగాణ హైకోర్టు జడ్జి లక్ష్మీనారయణకు బొకే అందజేస్తున్న అధికారులు

యర్రగొండపాలెం: సంక్రాంతి పండగ సందర్భంగా తెలంగాణ హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ ఆదివారం మండలంలోని ఇష్టకామేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన భోగి మంటలు వేశారు. తహసీల్దార్ కె.రవీంద్ర రెడ్డి, పాలుట్ల పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర నాయక్, ఎస్టీ సెల్ నాయకుడు హనుమా నాయక్ మర్యాద పూర్వకంగా ఆయన్ను కలిసి బొకే అందజేశారు.

రాష్ట్రానికి దరిద్రం చంద్రబాబు

● పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి



పోర్టు పనులు పరిశీలిస్తున్న పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు చేసిందేమీ లేదని, ఆయన రాష్ట్రానికి పట్టిన దరిద్రమని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) విమర్శించారు. ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం పోర్టును పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్ రెడ్డి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కనిగిరిలో నిర్వహించిన బహిరంగ సభలో రామాయపట్నం పోర్టుకు తానే శంకుస్థాపన చేశానని, నేను వచ్చాక ప్రారంభిస్తానని చంద్రబాబు పిచ్చి మాటలు మాట్లాడారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ఫిబ్రవరి 24న రామాయపట్నం పోర్టును ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కేవలం 20 నెలల్లో రామాయపట్నం పోర్టు కట్టిన మొగాడు దేశం మొత్తం మీద సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. పోర్టు నిర్మాణాన్ని చంద్రబాబు కళ్లు తెరిచి చూడాలని హితవు పలికారు. చంద్రబాబు ఇష్టమొచ్చినట్లు పిచ్చిపిచ్చిగా మాట్లాడటం సరికాదన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణం దాదాపు పూర్తయినా.. పదే పదే అభివృద్ధి జరగలేదని మాట్లాడటం చంద్రబాబుకు, టీడీపీ నాయకుల విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. రామాయపట్నం పోర్టును చూడటానికి జనాలు తండోపతండాలు వస్తున్నారన్నారు. పోర్టును చూసి ప్రజలు సంతోషం వ్యక్త చేస్తున్నారన్నారు. చంద్రబాబు పోర్టు గురించి మాట్లాడినందుకే తమ బృందంతో పరిశీలనకు వచ్చామన్నారు. పోర్టు వద్ద జనంతో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఆయన వెంట జిల్లా వైఎస్సార్ సీపీ కోశాధికారి మండాది కృష్ణారెడ్డి, కనిగిరి ఏజీపీ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, తురకపల్లి సర్పంచ్ రవీంద్రారెడ్డి, పులి రమేష్, ముత్యాల సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు సంగు వెంకటేశ్వర్లు, పుట్టా వెంకటరమేష్, వీరంరెడ్డి చైతన్య, హార్టికల్చర్ రిటైర్డు ఆఫీసర్ ఉడుముల లక్ష్మీనారాయణ, కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ వెంటే మా కుటుంబం



లయన్స్‌క్లబ్ భోగి సంబరాల్లో మాట్లాడుతున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

● ఒకటి లేదా రెండు రోజుల్లో ఇళ్ల స్థలాలకు నిధులు విడుదల
● ఒంగోలు బరిలో నిలిచేది బాలినేని శ్రీనివాసరెడ్డే..
● వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి స్పష్టీకరణ

ఒంగోలు: తమ కుటుంబం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తుందని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక సాయిబాబా ఆలయం వద్ద లయన్స్ క్లబ్ సభ్యులు నిర్వహించిన భోగి సంబరాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు పేదలకు, ధనవంతులకు మధ్య జరగనున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ పేద ప్రజల పక్షపాతి అని పేర్కొన్నారు. అపోహలను నమ్మాల్సిన అవసరం లేదన్నారు. తన తండ్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేద ప్రజలకు ఇంటి పట్టాలు ఇస్తానని వాగ్దానం చేశారన్నారు. 24 వేల పట్టాలు ఇవ్వాల్సిన బాధ్యతను ఆయన తీసుకున్నారన్నారు. ఇచ్చిన మాట తప్పకూడదనే ధ్యేయంతో స్థలాలకు సంబంధించిన నిధుల కోసం ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. ఒకటి లేదా రెండు రోజుల్లో ఇళ్ల స్థలాలకు నిధులు విడుదల అవుతాయన్నారు. డబ్బు విడుదల కాగానే పట్టాల పంపిణీ ప్రక్రియను బాలినేని శ్రీనివాసరెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తారని, ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ దఫా ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని, తన తండ్రి బాలినేని శ్రీనివాస రెడ్డే బరిలో ఉంటారని ప్రణీత్‌రెడ్డి స్పష్టం చేశారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

● అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉంది
● హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు



కనుమళ్లలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ మన్మథరావు

సింగరాయకొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని హైకోర్టు జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. మండలంలోని కనుమళ్ల పంచాయతీ చిన్నకనుమళ్ల ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జస్టిస్ కె.మన్మథరావు మాట్లాడుతూ.. తాను 1991 నుంచి 1999 వరకు కందుకూరు కోర్టులో న్యాయవాదిగా పని చేశానన్నారు. తరువాత అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం హైకోర్టు న్యాయమూర్తిగా నియమితుడినయ్యానన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేసే విధుల్లో ఉండటాన్ని ఎంతో గర్విస్తున్నానన్నారు. 1995–96లో జిల్లాలో అమలవుతున్న అక్షర ప్రకాశం కార్యక్రమంలో తాను సభ్యుడిగా ఉండి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేశానన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. రిటైర్డ్ డీటీఓ మన్నం సుగుణమ్మ, ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ పీడీ సత్యపాల్, డాక్టర్ కసుకుర్తి వెంకట్రావు, గీతం యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ చింతకాయల ప్రజ్ఞ, బాలకోటయ్య, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెడుగుడు పోటీలు



మొదటి బహుమతి అందుకుంటున్న చీరాల జయం ఫ్రెండ్స్ జట్టు



రెండవ బహుమతి అందుకుంటున్న కరవది సూర్యకిరణాలు జట్టు

ఒంగోలు రూరల్: అఖిలభారత యువ జన సమాఖ్య 73వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పలు జిల్లాల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించిన ఈ పోటీల్లో మొదటి బహుమతిని జయం ఫ్రెండ్స్(చీరాల) సాధించగా, రెండో బహుమతిని సూర్యకిరణాలు(కరవది), మూడో బహుమతిని గరికముక్కల శామ్యూల్ (కరవది), నాలుగో బహుమతి మన్నం వారిపాలెం(చిన్నగంజాం) జట్లు సాధించాయి. రైడింగ్, ట్యాకిలింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచిన గొలిమి వేణుగోపాల్ బెస్ట్ ప్లేయర్‌గా నిలిచారు. విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు జి.రవి, జి.శివాజి, తిమోతి, సురేష్ మాట్లాడుతూ.. మూడు జిల్లాల నుంచి 14 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని తెలిపారు. బహుమతి ప్రదానోత్సవంలో సీపీఐ నాయకులు పాలవరపు సీతారామయ్య, వడ్డె హనుమారెడ్డి, జి.రవి, కేవీవీ ప్రసాద్, మీజీ సర్పంచ్ కరవది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన చెన్నై జట్లు

● హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ పోటీలు

మేదరమెట్ల: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతల క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్ 2024 పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన రెండు మ్యాచ్‌లలో చెన్నై జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరాయి. ఉదయం శ్రీసీసీ (చెన్నై)–థండర్‌బోల్ట్ (తిరుపతి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన తిరుపతి జట్టు ప్రత్యర్థి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్ ఆరంభించిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులో మురుగేష్ 34 నాటౌట్, వసీం 25 పరుగులు చేశారు. తిరుపతి బౌలర్లలో ప్రకాష్, నవీద్ చెరీ రెండు వికెట్లు తీశారు. అనంతరం 124 పరుగులు విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి జట్టు పేలవ ఆట తీరుతో 11.3 ఓవర్లలో 44 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. చెన్నై బౌలర్లలో టీ.తరుణ్ 2.3 ఓవర్లలో 7 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసి తిరుపతి జట్టు వెన్నువిరిచాడు. దీంతో 79 పరుగుల భారీ తేడాతో శ్రీసీసీ చెన్నై జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది.

= మధ్యాహ్నం ప్రసాద్ జీ స్పోర్ట్స్ లెవెన్ (హైదరాబాద్)–జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ బ్యాటింగ్ ఎంచుకొని 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. జట్టులో అభి 56 పరుగులు చేశాడు. చెన్నై జట్టు బౌలర్ చంద్రశేఖర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 142 పరుగుల విజయం లక్ష్యం కోసం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 16.2 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయం సాధించింది. దీంతో జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకుంది. జట్టులో కవిన్ 44 పరుగులు, సుధాన్ 32 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు.

నేడు సెమీ ఫైనల్స్‌లో తలపడే జట్లు..

ఉదయం మొదటి సెమీఫైనల్ చిక్కోల్ చీతాస్ (శ్రీకాకుళం)–శ్రీసీసీ (చెన్నై) జట్ల మధ్య జరుగుతుంది. మధ్యాహ్నం రెండో సెమీఫైనల్ జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై)–సౌత్ సెంట్రల్ సీసీ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.

ఫుడ్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

● సుమారు రూ.50 కోట్లకు పైగా నష్టం



ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై

కురిచేడు: మండలంలోని ఆవులమంద గ్రామ పంచాయతీ పరిధిలోని ముష్టగంగవరం గ్రామ సమీపంలో గుండ్లకమ్మ వాగు పక్కన ఎస్‌హెచ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ శనివారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైన విషయం విదితమే. యూనిట్ జనరల్ మేనేజర్ బీఎస్ఎల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 6 గంటలకు సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. సుమారు 7 గంటల సమయంలో యూనిట్‌లో నుంచి పొగలు వస్తున్నట్లు సమాచారం అందింది. సమీప గ్రామంలో ఉంటున్న సిబ్బంది నాగార్జున అనే సిబ్బందికి ఫోన్ చేసి ఫ్యాక్టరీ వద్దకు పంపారు. లోపల వ్యాక్యూం పైపులు పేలి మంటలు వస్తున్నాయని తెలిపాడు. యూనిట్‌లో ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్లతో మంటలను 70 శాతం అదుపుచేశారు. ఆ తర్వాత 9 గంటల సమయంలో వినుకొండ, యర్రగొండపాలెం నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి రాత్రి 2 గంటల వరకు శ్రమించి మంటలను అదుపుచేశాయి. యూనిట్‌ను దర్శి డీఎస్పీ అశోకవర్ధన్, త్రిపురాంతకం సీఐ పాపారావు, కురిచేడు ఎస్సై దేవకుమార్ ఆదివారం ఉదయం సందర్శించారు.

ఆదివారం సాయంత్రం ఫిర్యాదు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అగ్నిప్రమాదానికి గురై నష్టం వాటిల్లిందని యూనిట్ జనరల్ మేనేజర్ ప్రసాద్ ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. రూ.150 కోట్లతో యూనిట్ నిర్మాణం చేశామని, అగ్నిప్రమాదం జరిగి ముఖ్యమైన మిషనరి కాలిపోవడం వల్ల సుమారు రూ.50 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై ఎం.దేవకుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవుడి పూజకు పూలు కోస్తూ..

● విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మార్టూరు: భోగి పండగ రోజు దేవుడికి పూజ చేయడం కోసం పూలు కోస్తున్న ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఆదివారం ఉదయం మార్టూరులో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వలపర్ల గ్రామానికి చెందిన వెచ్చా సుబ్బారాయుడు అలియాస్ చిన్నబుజ్జి (60) మార్టూరులో సొంతంగా గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వహిస్తూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భోగి పూజ నిమిత్తం ఇంటి పైన ఉన్న పూల మొక్కల నుంచి పూలు కోసేందుకు డాబాపైకి వెళ్లారు. పూలు కోసే క్రమంలో ఏసీ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు సుబ్బారాయుడికి తగలడంతో కాంక్రీట్ దిమ్మెను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. భర్త ఎంతకూ కిందకు దిగి రాకపోవడంతో డాబా పైకి వెళ్లిన భార్య పరిస్థితిని గమనించి కేకలు వేస్తూ ఇరుగు పొరుగు వారిని పిలిచింది. సుబ్బారాయుడును పరిశీలించిన స్థానికులు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు కాగా అందరూ అమెరికాలో స్థిరపడ్డారు. వారు వచ్చేంత వరకు మృతదేహాన్ని భద్రపరిచేందుకు చిలుకలూరిపేట మార్చురీకి తరలించారు.



వెలకట్టలేని ఆనందం

● ఆఫ్రికాలో ఉద్యోగం చేస్తూ ఏటా సంక్రాంతికి ఇంటికొస్తున్న ఎన్నారై రవి
● తూర్పువీరాయపాలెంలో సందడి

దర్శి: ఎక్కడున్నా పండగకు ఇంటికొస్తే ఆ ఆనందమే వేరు. బంధువులు, స్నేహితులతో కలిసి గడిపే ఆ క్షణాలు ఎన్నటికీ మరువలేని తీపి గురుతులు..!! దర్శి మండలం తూర్పు వీరాయపాలేనికి చెందిన ముప్పరాజు వెంకట రవి ఏడేళ్లుగా ఆఫ్రికా ఖండంలోని జాంబియా దేశంలో లుసాకా కాప్టెల్ సిటీలో ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్స్ ఆపరేషనల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటా డిసెంబర్ నెలాఖరులో వచ్చి సంక్రాంతి పండగకు బంధువులతో ఆనందంగా గడిపి వెళ్తుంటారు. తాను ఎన్నారై అని మరచిపోయి పిండి దంచడం, పిండి వంటకాల తయారీలో సహాయం చేయడం లాంటి పనుల్లో నిమగ్నమై పండగ వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. స్నేహితులు, బంధువులకు ఆఫ్రికా నుంచి బహుమతులు తీసుకువచ్చి ఇస్తుంటారు. అంతే కాదు తమ పొలంలో పంటలను పరిశీలించి సూచనలు సలహాలు ఇస్తుంటారు.



ఇంట్లో తల్లితో..

ప్రభుత్వ పనితీరు బాగుంది: ముప్పరాజు వెంకటరవి

మాది కమ్మ సామాజిక వర్గం. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో భూ ఆక్రమణలు జరిగాయి. మా గ్రామంలో రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. జన్మభూమి కమిటీలు ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేశాయి. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితులు లేవు. కక్ష సాధింపులు లేవు. వలంటీర్లు అందరికీ పథకాలు అందిస్తున్నారు. మా గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా పండగ చేసుకుంటున్నాం. చంద్రబాబు హయాంలో వర్షాలు లేక, పంటలు పండక విదేశాల్లో ఉద్యోగానికి వెళ్లా. ప్రస్తుతం రైతుల పరిస్థితి బాగానే ఉంది. నేను ఉద్యోగంలో బాగానే స్థిరపడ్డాను. ఇక్కడకు వచ్చినప్పుడు వ్యవసాయంపై మక్కువతో మా పొలాలు కూడా చూసుకుంటుంటా. సంక్రాంతి తర్వాత ఆఫ్రికా వెళ్లి మళ్లీ ఏడాదికి వస్తా.



బంధువులతో కలసి పిండి దంచుతున్న ముప్పరాజు రవి



కారు ఢీకొని వ్యక్తి మృతి



శ్రీను మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు కారు ఢీకొని మండలంలోని ఊళ్లపాలెం ఎస్టీ కాలనీలో నివసిస్తున్న శ్రీను(45) మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై కందుకూరు ఫ్లయ్ ఓవర్ సమీపంలో వైఎస్సార్ ఆర్చి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన బేల్దారి మేస్త్రి శ్రీను ఊళ్లపాలెం ఎస్టీ కాలనీకి చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే నివసిస్తున్నాడు. తిరుపతిలో బేల్దారి పనికి వెళ్లి పండుగకు భార్య దగ్గరికి వచ్చేందుకు ట్రావెల్స్ బస్సులో కందుకూరు ఫ్లయ్‌ఓవర్ సమీపంలో రాత్రి రెండు గంటల సమయంలో దిగాడు. ఆ సమయంలో మంచు అధికంగా కురుస్తూ రోడ్డు కూడా కనపడని పరిస్థితి ఉంది. శ్రీనుతోపాటు జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటకు చెందిన బేల్దారి మేస్త్రీ వెంకటేశ్వర్లు కూడా బస్సు దిగాడు. మొదట శ్రీను ఒక్కడే రోడ్డు దాటగా వెంకటేశ్వర్లు మాత్రం రోడ్డు దాటలేదు. దీంతో శ్రీను మరల వెనక్కి వెళ్లి తనతోపాటు వెంకటేశ్వర్లును రమ్మని చెప్పి ఒక్కడే రోడ్డు దాటే ప్రయత్నంలో నెల్లూరు వైపు వెళ్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.